సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

తోటల పరిశీలనలో డీహెచ్ఎస్‌వో ఎంవీ మధుసూదన్

పంటలను పరిశీలిస్తున్న ఉద్యానశాఖ ఎంవీ మధుసూదన్

ఖమ్మం రూరల్, ఫిబ్రవరి 7 : నిత్యం పంట పొలాలను పరిశీలిస్తూ ఉండాలని, చీడపీడల నివారణకు సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి ఎంవీ మధుసూదన్ సూచించారు. ఉద్యాన వన శాఖ పాలేరు డివిజన్ అధికారి అపర్ణతో కలిసి ఖమ్మం రూరల్ మండలంలోని తల్లంపాడు, మద్దులపల్లి, పొన్నెకల్లు గ్రామాల్లో శుక్రవారం విసృతంగా పర్యటించిన ఆయన.. అక్కడి ఆయిల్‌పాం, కూరగాయలు, మామిడితోటలను పరిశీలించారు. ప్రస్తుత తరుణంలో రైతులు అనుసరించాల్సిన పద్ధతుల గురించి అవగాహన కల్పించారు. తోటలకు సోకే చీడపీడల గురించి, వాటి నివారణకు చేపట్టాల్సిన చర్యల గురించి వివరించారు. ఆధునిక పద్ధతిలో సాగు చేపడితే అశించిన దిగుబడులు పొందవచ్చని అన్నారు. పామాయిల్ సాగుతో రైతులకు బహుళ ప్రయోజనాలు ఉన్నాయని అన్నారు. ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ఆయేషాకు 'శ్రీచైతన్య' అభినందనలు

ఆయేషాబేగంను అభినందిస్తున్న శ్రీచైతన్య డైరెక్టర్లు శ్రీవిద్య, సాయిగీతిక

ఖమ్మం రూరల్, ఫిబ్రవరి 7: మండలంలోని శ్రీచైతన్య ఇంజినీరింగ్ కళాశాలలో చదువుతున్న ఆయేషా బేగాన్ని కళాశాల యాజమాన్య బాధ్యులు శుక్రవారం అభినందించారు. శ్రీచైతన్య ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విద్యార్థిని ఆయేషా.. ఉత్తమ ప్రతిభ చూపి జేఎన్‌టీయూహెచ్ స్థాయిలో 8.79 గ్రేడ్ పాయింట్లతో టాపర్‌గా నిలిచింది. ఇందుకుగాను ఇటీవల జరిగిన జేఎన్‌టీయూహెచ్ వార్షికోత్సవంలో యూనివర్సిటీ బాధ్యులు ఆమెకు గోల్డ్‌మెడల్ ప్రదానం చేశారు. దీంతో శుక్రవారం స్థానిక కళాశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థిని ఆయేశాను శ్రీచైతన్య కళాశాల యాజమాన్య బాధ్యులు మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్లు శ్రీవిద్య, సాయి గీతికలు అయేషాను సత్కరించారు. మురళీ కృష్ణ, సుదర్శన్, వైశాలి పాల్గొన్నారు.

పెన్షన్‌లు సకాలంలో అందించాలి

రిటైర్డు ఉద్యోగుల వినతి

చైర్మన్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న రిటైర్డు అధికారులు

ఖమ్మం వ్యవసాయం, ఫిబ్రవరి 7 : రిటైర్డు ఉద్యోగులు, అధికారులకు పెన్షన్‌లు సకాలంలో అందేవిధంగా చర్యలు తీసుకోవాలని మార్కెట్ కమిటీ రిటైర్డు ఉద్యోగులు కోరారు. శుక్రవారం ఖమ్మం నగర వ్యవసాయ మార్కెట్‌లోని చైర్మన్ కార్యాలయంలో ఏఎంసీ చైర్మన్ యరగర్ల హనుమంతరావును కలిసి వినతిపత్రం అందించారు. ఇటీవల బాధ్యతలు చేపట్టిన సందర్భంగా చైర్మన్‌కు పుష్పగుచ్చాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రిటైర్డు అధికారులు కనపర్తి బాబు, జల్లా వెంకటేశ్వర్లు, ఆమంచి కోటయ్య, హుస్సేన్, బాబులాల్ ఉన్నారు.

స్మార్ట్‌కిడ్జ్‌లో స్పోర్ట్స్ మీట్

క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న డీవైఎస్‌వో సునీల్‌రెడ్డి

ఖమ్మం అర్బన్, ఫిబ్రవరి 7 : ఖమ్మం నగరంలోని స్మార్ట్‌కిడ్జ్ పాఠశాలలో శుక్రవారం స్పోర్ట్స్‌మీట్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా డీవైఎస్‌వో సునీల్‌రెడ్డి హాజరై పోటీలను ప్రారంభించారు. క్రీడలు విద్యార్థులను మానసికంగా, శారీరకంగా ధృడంగా ఉండేందుకు దోహదపడతాయన్నారు. గెలుపోటములతో సంబంధం లేకుండా క్రీడా స్ఫూర్తితో రాణించాలన్నారు. విజేతలుగా నిలిచిన వారికి శనివారం బహుమతులు అందజేస్తామని కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణచైతన్య తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ట్రంప్ వైఖరిపై నిరసన

ట్రంప్ ఫొటోలను దహనం చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

ఖమ్మం అర్బన్, ఫిబ్రవరి 7 : అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మాస్క్‌లను ధరించి ఖమ్మం నగరంలోని కేయూ పీజీ కళాశాల వద్ద పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ట్రంప్ ఫొటోలను దహనం చేశారు. భారతీయులను ట్రంప్ అవమానించినా ప్రధాని మోదీ స్పందించకపోవడం దారుణమమని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి వెంకటేష్ అన్నారు. పీడీఎస్‌యూ నాయకులు సాధిక్, నసీర్, నిగ్నేష్, రఫీ, అనూష, అఖిల, సంధ్య, స్పందన, సింధు పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

అయోమయం.. గందరగోళం

రిటైనింగ్ వాల్ నిర్మాణం కోసం ఎంజాయ్‌మెంట్ సర్వే
ప్రైవేటు భూములు, ప్లాట్లు, ఇండ్లు కోల్పోతున్న పేదలు
నష్ట పరిహారంపై స్పష్టతనివ్వని అధికారులు

మున్నేరుపై జరుగుతున్న కాంక్రీట్ వాల్ నిర్మాణ పనులు

రఘునాథపాలెం, ఫిబ్రవరి 7: ఆస్తులు కోల్పోతున్నామంటే ఎవరికైనా ఆందోళన తప్పదు. ఉన్నది కళ్లముందే లాగేసుకుంటుంటే ఏం అర్థంకాని స్థితిలోకి వెళ్లిపోతాం. ఖమ్మం నగరం మున్నేరు రిటైనింగ్ వాల్ నిర్మాణంలో భూములు, ప్లాట్లు, ఇండ్లు కోల్పోతున్న పేదలది ఇదే పరిస్థితి. వాల్ నిర్మాణం కోసం రెవెన్యూ అధికారులు సర్వే చేస్తుంటే పేదలు అయోమయం.. గందరగోళానికి గురవుతున్నారు. గతేడాది మున్నేరు పెద్దఎత్తున వచ్చి సమీపంలోని ఇళ్లు ముంపునకు గురికావడంతో రాష్ట్ర ప్రభుత్వం మున్నేరుకు ఇరువైపులా కాంక్రీట్ వాల్ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. సుమారు ఖమ్మంనగర పరిధిలో మున్నేరు రెండువైపులా 17.50 కిలోమీటర్ల మేర రిటైనింగ్ వాల్ నిర్మాణాన్ని చేపట్టేందుకు నిధులు మంజూరు చేసింది. అయితే ఓ పక్క పనులు ప్రారంభమై వేగవంతంగా కొనసాగుతున్నాయి. తొలుత ప్రభుత్వ భూములు ఉన్న ప్రాంతాల్లో అధికారులు పనులు చేపడుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో ప్రైవేటు భూములు, ప్రైవేటు ప్లాట్లు, ఇళ్ల నిర్మాణాలు సైతం పోతున్నట్లు రెవెన్యూ అధికారులు గుర్తించారు. 50ఎకరాల మేరకు ప్రైవేటు భూములను రైతుల నుంచి తీసుకునేందుకు గుర్తించినట్లు తెలిసింది. ప్రైవేటు ఖాళీ ప్లాట్లు, ఇండ్లు కట్టుకున్న వారు 250 మందికి పైగా ఉన్నారు. అయితే భూములు, ప్లాట్లు గుర్తించిన అధికారులు నేటికీ వారికి నష్టపరిహారంపై హామీ ఇవ్వలేదు. ఏ సర్వే నెంబరులో ఎంత భూమి అవసరం, ఆయా భూములకు చెందిన రైతుల జాబితాను సిద్ధం చేసిన అధికారులు రైతులతో మాత్రం ముచ్చటించి పరిహారంపై మాట్లాడిందీ లేదు. మున్నేరుకు ఆనుకొని ఎకరం 3 నుంచి రూ.4 కోట్లపైనే మార్కెట్ ధర ఉందని ఆ ప్రకారంగానే తమకు నష్టపరిహారం చెల్లించాలని బాధితులు కోరుతున్నారు. లేదంటే భూములను ఇచ్చేందుకు ఒప్పుకోమని పేర్కొంటున్నారు.

ఎంజాయ్‌మెంట్ సర్వే చేస్తున్నాం..

మున్నేరు రిటైనింగ్ వాల్ నిర్మాణంలో భాగంగా ఖమ్మం అర్బన్ పరిధిలోని దానవాయిగూడెం, మల్లెమడుగు, బుర్హాన్‌పురం, ఖమ్మం ప్రాంతాలను గుర్తించి ఎంజాయ్‌మెంట్ సర్వే చేస్తున్నాం. కొంతమేర ప్రైవేటు భూములు, ప్లాట్లు, ఇండ్లు సైతం వాల్ నిర్మాణంలో పోతున్నట్లు గుర్తించాం. ప్రైవేటు భూములను కలిగిన రైతులు సైతం ఉన్నారు. పూర్తి సర్వే అనంతరం నష్టపరిహారం నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తాం.

– రవికుమార్, ఖమ్మం అర్బన్ తహసీల్దార్

మాజీ జడ్పీటీసీని పరామర్శించిన ఎమ్మెల్సీ తాతా మధు

జగన్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ తాతా మధు, బీఆర్ఎస్ నాయకులు

కారేపల్లి, ఫిబ్రవరి 7: మండలంలోని భాగ్యనగర్‌తండాకు చెందిన మాజీ జడ్పీటీసీ వాంకుడోత్ జగన్ నాయక్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ తాత మధుసూదన్ రావు శుక్రవారం ఆయన ఇంటికెళ్లి పరామర్శించి ప్రమాదం జరిగిన తీరు, ప్రస్తుత ఆరోగ్య స్థితిగతులపై అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సొసైటీ వైస్ చైర్మన్ ధరావత్ మంగీలాల్, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ ముత్యాల సత్యనారాయణ, మాజీ జడ్పీటీసీ ఉన్నం వీరేందర్, మాజీ వైస్ ఎంపీపీ రావూరి శ్రీనివాసరావు, యూత్ నాయకులు ముత్యాల వెంకట అప్పారావు, అడపా పుల్లారావు, మాజీ సర్పంచ్ బానోత్ కుమార్, శివరాత్రి అచ్చయ్య, బత్తుల శ్రీనివాసరావు, బానోత్ రాందాస్, ఇస్లావత్ బన్సీలాల్, సిద్ధంశెట్టి నాగయ్య, జాలా సాంబ, షేక్ ఖాజావలి, యాకుబ్ పాషా, షేక్ సలీం గుగులోత్ భాస్కర్, బాబులాల్, సూక్య ఉన్నారు.

రామాలయ ప్రతిష్ఠా మహోత్సవం

ప్రతిష్ఠా మహోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే సండ్ర

సత్తుపల్లిటౌన్, ఫిబ్రవరి 6: పట్టణలోని అయ్యగారిపేటలో నూతనంగా నిర్మించిన రామాలయ ప్రతిష్ఠ మహోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. మాజీఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పాల్గొని స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు. చిలకలూరిపేట నుంచి తెప్పించిన గ్రానైట్‌రాళ్లతో ఆలయాన్ని నిర్మించి అందులో మూలవిరాట్ విగ్రహాలను ప్రతిష్ఠించారు. అదేవిధంగా ఆలయం ఎదుట ధ్వజస్తంభాన్ని వేదమంత్రాల నడుమ ప్రతిష్ఠింప చేశారు. కార్యక్రమంలో కూసంపూడి మహేశ్, కొత్తూరు ఉమామహేశ్వరరావు, దొడ్డా శంకర్‌రావు, అంకంరాజు, నరుకుళ్ల శ్రీనివాసరావు, మిద్దె శ్రీను, వల్లభనేని పవన్, బొంతు శ్రీనివాసరావు, దేవరపల్లి ప్రవీణ్, చలగుళ్ల కృష్ణయ్య, వినుకొండ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ముసలిమడుగు గురుకుల పాఠశాల సందర్శన

మాట్లాడుతున్న అధికారులు

వైరాటౌన్, ఫిబ్రవరి 7: మండలంలోని ముసలిమడుగు టీజీటీడబ్ల్యూయూ ఆర్‌జేసీ బాలికల హాస్టల్‌ని జిల్లా వైద్యాధికారి డాక్టర్ కళావతిబాయ్, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ చందునాయక్, ఎన్‌హెచ్ఎం జిల్లా ప్రోగ్రాం అధికారి దుర్గ శుక్రవారం సందర్శించారు. సికిల్ సెల్ అనిమియా కార్యక్రమంలో భాగంగా డాక్టర్ కళావతిబాయ్, విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించి రక్త నమూనాలు సేకరించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ శిరీష, డాక్టర్ శ్రీనివాస్, వైరా పీహెచ్‌సీ సిబ్బంది, వైరా సీహెచ్‌సీ ఎల్‌టీ కరణ్‌సింగ్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విద్యార్థులు ప్రణాళికతో చదవాలి

మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్

సత్తుపల్లిటౌన్, ఫిబ్రవరి 7: విద్యార్థులు ప్రణాళికతో చదివితే పోటీ పరీక్షల్లో విజయం సాధించవచ్చని సత్తుపల్లి జేవీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.గోపి అన్నారు. శుక్రవారం కళాశాలలో నాలెడ్జ్ ఎక్స్‌పో కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పోటీపరీక్షలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎంచుకున్న పోటీ పరీక్షపై ఇష్టపడి చదివితే చిన్న వయస్సులో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించవచ్చన్నారు. ఖమ్మం న్యూలైక్ కోచింగ్ సెంటర్ డైరెక్టర్ సతీశ్ మాట్లాడుతూ పోటీ పరీక్షల ప్రిపరేషన్‌ను సమయపాలన ముఖ్యమన్నారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ రాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

బోనకల్లు, ఫిబ్రవరి 7: మండలంలోని పలు బాధిత కుటుంబాలను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శుక్రవారం పరామర్శించారు. గత నెల 31న బోనకల్లు సమీపంలో ఎన్నెస్పీ కాలువ వద్ద కూలీలతో వెళ్తున్న ఓ ట్రాక్టర్ బోల్తా కొట్టిన ప్రమాదంలో యార్లగడ్డ వరమ్మ మృతిచెందగా మరో 12 మంది తీవ్రంగా గాయపడిన విషయం విదితమే. అయితే, ఓ శుభకార్యం నిమిత్తం శుక్రవారం బోనకల్లుకు వచ్చిన మంత్రి పొంగులేటికి.. స్థానిక నాయకులు ఈ ప్రమాద విషయం గురించి చెప్పారు. దీంతో మంత్రి పొంగులేటి సదరు బాధితుల ఇళ్లకు వెళ్లి వారిని పరామర్శించారు. మృతురాలు వరమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తీవ్రగాయాలపాలైన పెద్దగొండ్ల వెంకటరమణ, మొర్ల శైలజ, మరీదు శైలజ, మరీదు ధనలక్ష్మి, మరీదు పద్మ, పసల త్రివేణి, గద్దె పుల్లమ్మలను పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. వీరందరికీ స్వయంగా ఆర్థిక సాయం అందించారు.

పేదల సంక్షేమాన్ని విస్మరిస్తున్న కేంద్ర ప్రభుత్వం

కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

సత్తుపల్లిటౌన్, ఫిబ్రవరి7: కేంద్ర ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని విస్మరించిందని సీపీఎం సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణరెడ్డి ఆరోపించారు. శుక్రవారం సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో తాళ్లమడ గ్రామసెంటర్‌లో రాస్తారోకో చేసి కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. పట్టణ ఉపాధి హామీ పథకాన్ని ప్రారంభించాలన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు జాజిరి శ్రీనివాస్, పాండురంగారావు, సర్వేశ్వరరావు, బాలబుచ్చయ్య, కుమారస్వామి, సునందన్‌రావు, కృష్ణ, వేలాద్రి పాల్గొన్నారు.

ఎర్రుపాలెంలో..

ఎర్రుపాలెం, ఫిబ్రవరి 7: మూడు పర్యాయాలు కేంద్రంలో మోదీ గెలిచింది దేశాన్ని పాలించడం కోసం కాదని.. ఆయనకు వంతపాడే కార్పొరేట్లకు దేశ సంపదను పంచిపెట్టేందుకేనని సీపీఎం మధిర డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు విమర్శించారు. ఎర్రుపాలెంలోని రామిశెట్టి పుల్లయ్యభవనంలో శుక్రవారం జరిగిన సీపీఎం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. మోదీ పాలనకు వ్యతిరేకంగా ఈ నెల 10న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఆ పార్టీ నాయకులు నల్లమోతుల హనుమంతరావు, దివ్వెల వీరయ్య, మద్దాల ప్రభాకర్ పాల్గొన్నారు.

మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ సీతారాములుకు సన్మానం

వైరాటౌన్, ఫిబ్రవరి 7: వైరా మున్సిపాలిటీకి ఐదు సంవత్సరాలు వైస్ చైర్మన్‌గా పనిచేసి పదవీ విరమణ చేసిన ముళ్ళపాటి సీతారాములుని వారి స్వగృహంలో పీఆర్‌టీయూ వైరా మండల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీత సీతారాములు మాట్లాడుతూ రాష్ట్రంలో అతి పెద్ద ఉపాధ్యాయ సంఘంగా ఉపాధ్యాయుల సంక్షేమం కోసం నిరంతరం పనిచేసే సంఘం పీఆర్‌టీయూ అని కొనియాడారు. కార్యక్రమంలో గరికపాడు హైస్కూల్ హెచ్ఎం డీ.సత్యనారాయణ, పీఆర్‌టీయూ నాయకులు ఎస్.జాన్, కారుమంచి దయాకర్‌రావు, పాటి రామచంద్రయ్య, వెలిశెట్టి నర్సింహారావు, వేమిరెడ్డి గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

బోనకల్లు, ఫిబ్రవరి 7: మండలంలోని పలు బాధిత కుటుంబాలను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శుక్రవారం పరామర్శించారు. గత నెల 31న బోనకల్లు సమీపంలో ఎన్నెస్పీ కాలువ వద్ద కూలీలతో వెళ్తున్న ఓ ట్రాక్టర్ బోల్తా కొట్టిన ప్రమాదంలో యార్లగడ్డ వరమ్మ మృతిచెందగా మరో 12 మంది తీవ్రంగా గాయపడిన విషయం విదితమే. అయితే, ఓ శుభకార్యం నిమిత్తం శుక్రవారం బోనకల్లుకు వచ్చిన మంత్రి పొంగులేటికి.. స్థానిక నాయకులు ఈ ప్రమాద విషయం గురించి చెప్పారు. దీంతో మంత్రి పొంగులేటి సదరు బాధితుల ఇళ్లకు వెళ్లి వారిని పరామర్శించారు. మృతురాలు వరమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తీవ్రగాయాలపాలైన పెద్దగొండ్ల వెంకటరమణ, మొర్ల శైలజ, మరీదు శైలజ, మరీదు ధనలక్ష్మి, మరీదు పద్మ, పసల త్రివేణి, గద్దె పుల్లమ్మలను పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. వీరందరికీ స్వయంగా ఆర్థిక సాయం అందించారు.

వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన

సత్తుపల్లిటౌన్, ఫిబ్రవరి 7: సత్తుపల్లి ఏరియాలోని అర్బన్ పార్క్‌లో వీధి కుక్కల బారీ నుంచి దుప్పులను రక్షించేందుకు దుప్పుల సంరక్షణార్థం అర్బన్‌పార్క్ చుట్టూ కోటి రూపాయల వ్యయంతో పెన్సింగ్ నిర్మాణానికి శుక్రవారం కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఎం.షాలెంరాజు శంకుస్థాపన చేశారు. అనంతరం జేవీఆర్ ఓసీలో రూ.10 లక్షల వ్యయంతో నిర్మించిన డంపర్, డోజర్ వాహనాల బ్యాటరీ ఛార్జింగ్‌రూం, జేవీఆర్ డిస్పెన్సర్‌లో రూ.35 లక్షల వ్యయంతో అధునాతనమైన నూతన డిజిటల్ ఎక్సరే మిషన్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో సత్తుపల్లి ఏరియా ఏఐటీయూ బ్రాంచ్ సెక్రటరీ సముద్రాల సుధాకర్, ఐఎన్‌టీయూసీ వైస్ ప్రెసిడెంట్ ఎండీ.రజాక్, సత్తుపల్లి ఏరియా ఫారెస్ట్‌రేంజ్ ఆఫీసర్ స్నేహలత, జేవీఆర్ ఓసీ ప్రాజెక్టు ఆఫీసర్ ఎన్ వీఆర్.ప్రహ్లాద, ఏజీఎం సీహెచ్.రామకృష్ణ, కిష్టారం ఓసీ ప్రాజెక్టు ఆఫీసర ఎంవీ.నర్సింహారావు, ప్రాజెక్టు ఇంజినీర్ డీ.శ్రీనివాస్, ఫిట్ సెక్రటరీలు నర్సింహారావు, రామారావు, ఓసీ సీనియర్ పీవో కే.దేవదాస్, సివిల్ సంబంధిత అధికారులు రవికుమార్, నవీన్, రవీందర్ పాల్గొన్నారు.

గంజాయి నిందితుల అరెస్టు

మామిళ్లగూడెం, ఫిబ్రవరి 7 : గంజాయి కలిగి ఉన్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఖమ్మం రెండో పట్టణ సీఐ బాలకృష్ణ తెలిపారు. గురువారం మధ్యాహ్నం సమయంలో పాత డీఆర్‌డీఏ కార్యాలయ సమీపంలో వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారని పేర్కొన్నారు. నిందితులు ఖమ్మం నగరంలోని వేర్వేరు ప్రాంతాలకు చెందిన వ్యక్తులుగా గుర్తించామన్నారు. రమణగుట్టకు చెందిన కొట్టె ప్రవీణ్(బైక్ మెకానిక్), రాపర్తినగర్, వివేకానంద వీధికి చెందిన పసుపులేటి సత్యనారాయణ(డీఆర్‌డీఏ అటెండర్), రాపర్తినగర్‌కు చెందిన గొడుగు సాయిరాం అలియాస్ అర్జున్(కార్ డ్రైవర్) నుంచి 746 గ్రాముల గంజాయి, సెల్‌ఫోన్లు–3, 3వేల నగదు, హోండా యాక్టివా ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నామన్నారు. ముగ్గురు నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఇద్దరు మృతి

రఘునాథపాలెం, ఫిబ్రవరి 7 : ఆర్టీసీ బస్సు ద్విచక్ర వాహనాన్ని వేగంగా ఢీకొన్న ఘటనలో ఇద్దరు యువకులు మృత్యువాత పడ్డారు. ఈ ఘటన శుక్రవారం ఇల్లెందు రోడ్డు బూడిదంపాడు వద్ద చోటుచేసుకుంది. సీఐ ఉస్మాన్ షరీఫ్ తెలిపిన ప్రకారం.. రఘునాథపాలెం మండలం పువ్వాడ ఉదయ్‌నగర్ కాలనీకి చెందిన వరుసకు సోదరులైన భూక్యా విజయ్(33), తేజావత్ వీరబాబు శుక్రవారం కారేపల్లి మండలంలో బంధువులు చనిపోతే ద్విచక్ర వాహనంపై వెళ్లారు. తిరిగి వస్తుండగా బూడిదంపాడు రైతువేదిక వద్ద ఖమ్మం వస్తున్న ఇల్లెందు బస్సు వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో విజయ్, వీరబాబుకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందారు. సమాచారం అందుకున్న పోలీసులు అన్నం ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు సహాయంతో మృతదేహాలను ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. విజయ్‌కి భార్య, ముగ్గురు కుమారులు, వీరబాబుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

బోనకల్లు, ఫిబ్రవరి 6: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని కలకోట గ్రామం వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని ఆళ్లపాడు గ్రామానికి చెందిన తాళ్లూరి నాగేశ్వరరావు (50) ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా దుందిరాలపాడులోని బంధువుల ఇంటికి శుభకార్యానికి వెళ్లాడు. టీవీఎస్ ఎక్సెల్ మోపెడ్ వాహనంపై తిరిగి స్వగ్రామానికి వస్తున్నాడు. ఈ క్రమంలో కలకోట గ్రామ సమీపంలో ఆళ్లపాడు రోడ్డు వద్ద బ్రాహ్మణపల్లి వైపు నుంచి మధిర వెళ్తున్న మరో ద్విచక్ర వాహనం.. ఇతడిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నాగేశ్వరరావు తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు బోనకల్లు పోలీసులు తెలిపారు.

శ్మశానస్థల ఆక్రమణదారులకు నోటీసులు

మధిర, ఫిబ్రవరి 6: మధిర మున్సిపాలిటీ పరిధిలోని మున్నేరు సమీపంలో గల ఆక్రమణకు గురైన స్థలాన్ని అధికారులు ఇటీవల పరిశీలించారు. రికార్డుల ఆధారంగా సర్వే నిర్వహించారు. ఈ సర్వేలో స్థల ఆక్రమణకు పాల్పడిన వారికి ప్రభుత్వ ఆదేశాల మేరకు శుక్రవారం నోటీసులు జారీ చేశారు. నోటీసు పొందిన వారు 15 రోజుల్లో తగు సమాధానం ఇవ్వాలని సూచించారు. శ్మశాన స్థలంతోపాటు డొంక స్థలంలో సుమారు నాలుగు ఎకరాలు ఆక్రమణలకు గురైనట్లు అధికారులు అంచనా వేసి నివేదిక తయారు చేశారు.

'భవన నిర్మాణ బోర్డు'కు నిధులు కేటాయించాలి

బోనకల్లు, ఫిబ్రవరి 6 : భవన నిర్మాణ కార్మికుల కోసం వారి సంక్షేమ బోర్డుకు బడ్జెట్‌లో రూ.వెయ్యి కోట్ల నిధులను కేటాయించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బోనకల్లులో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంక్షోమ బోర్డులో దాదాపు 18 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులు సభ్యులుగా ఉన్నప్పటికీ వారి సంక్షేమానికి తగినన్ని నిధులు కేటాయించకపోవడం దారుణమని అన్నారు. మార్చి 1న ఖమ్మంలో జరిగే తెలంగాణ రాష్ట్ర బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) జిల్లా నాలుగో మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. సంఘం నాయకులు గాదె లక్ష్మీనారాయణ, యంగల ఆనందరావు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ

బోనకల్లు, ఫిబ్రవరి 7: జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులపై ఉపాధి హామీ మండల కార్యాలయంలో సామాజిక తనిఖీ కార్యక్రమాన్ని శుక్రవారం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా మండలంలోని 22 గ్రామాల్లో 2023 నుంచి ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు జరిగిన పనులపై గ్రామాల్లో సామాజిక తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో మండల వ్యాప్తంగా 255 పనులకు గాను రూ.2.5 కోట్లను ఖర్చు చేసినట్లు నిర్ధారణ చేశారు. గ్రామాల వారీగా చేసిన పనులపై డీఆర్‌డీఏ ఏపీడీ చుంచు శ్రీనివాసరావు సమక్షంలో ఫీల్డ్ తనిఖీ అధికారులు సమాచారాన్ని వివరించారు. మండల వ్యాప్తంగా ఫీల్డ్ అసిస్టెంట్లతోపాటు పంచాయతీ కార్యదర్శులు.. జరిగిన పనుల కంటే అదనంగా రూ.76 వేలను చెల్లించినట్లు గుర్తించారు. వీరి నుంచి డబ్బులు రికవరీ చేయాలని ఏపీడీ చుంచు శ్రీనివాసరావు ఆదేశించారు. అదేవిధంగా వీరికి రూ.20 వేల జరిమానా విధించారు. అధికారులు సక్రియా, రమేష్‌బాబు, రామకృష్ణ, రమాదేవి, శాస్త్రి, కృష్ణకుమారి పాల్గొన్నారు.

మాజీ ఉప సర్పంచ్‌కు నివాళి

మధ